క్లుప్తంగా

'వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'

దుబ్బాకటౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, షోలాపూర్ సౌత్ ఎమ్మెల్యే సుభాష్ సురేష్ చంద్ర దేశ్‌ముఖ్ అన్నారు. బుధవారం బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా దుబ్బాకలో బీజేపీ పదాధికారులు, దుబ్బాక మున్సిపల్ శక్తి కేంద్ర ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన సెకండ్ ఏఎన్ఎంలు

పదహారేళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేల కృషి చేయాలని కోరుతూ బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావును సెకండ్ ఏఎన్ఎంలు కలిసి వినతిపత్రం అందించారు.

సిద్దిపేట అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీలత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీలతను నియమిస్తూ ఉన్నతాధికారు లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ లత ప్రస్తుతం మెదక్ సబ్ రిజిస్ట్రార్‌గా వి.దు లు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు సిద్దిపేట అర్బన్ సబ్ రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉండడంతో సీనియర్ అసిస్టెంట్ ఇంచార్జీ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు. హుస్నాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా ఇంతియాజుద్దీన్ నియామకం అయ్యారు.

'నిరుద్యోగ దివ్యాంగులను ఆదుకోండి'

తొగుట(దుబ్బాక): నిరుద్యోగ దివ్యాంగులకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఎండీ సాజిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మండలస్థాయి వికలాంగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లలో తమకు 5 శాతం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు గొడ్డు బర్ల భాస్కర్, నాయకులు నరేష్, రజిత, మల్ల య్య, కావ్య, యాదయ్య, ఎల్లవ్వ పాల్గొన్నారు.

'రెవెన్యూ డివిజన్ సాధనలో భాగస్వాములు కండి'

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులతో పాటు అందరూ భాగస్వాములు కావాలని జేఏసీ ప్రతినిధులు ఒగ్గు రాజు, అందె బీరయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ.. చే ర్యాల రెవెన్యూ డివిజన్ చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు భిక్షపతి, టీడీపీ నాయకుడు లింగం ,భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు నాస్తిక్ రమేశ్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు బందిగ రాకేష్ కృష్ణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామగల్ల నరేష్, ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు, ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మహ్మద్ నవాజ్, నాయకులు వెల్డి సాయికిరణ్‌రెడ్డి, ఎర్ర సంతోష్ పాల్గొన్నారు.

ముత్తిరెడ్డికి టికెట్ రావాలని పూజలు

చేర్యాల(సిద్దిపేట): జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి మూడోసారి బీఆర్ఎస్ టికెట్ వచ్చేలా దీవించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మండల పరిధిలోని వీరన్నపేట దుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కొండపాక భిక్షపతి, ఎంపీటీసీ సభ్యుడు శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పెద్దింటి ప్రసాద్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగె కనకయ్య, ఉపాధ్యక్షుడు బాలస్వామి, నాయకులు మధు పాల్గొన్నారు.

'దళిత బంధు'పై కుట్రలు తిప్పికొట్టాలి

గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలు చేస్తున్న దళిత బంధు పథకం అమలుపై రాజకీయ లబ్ధి కోసం జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరముందని గజ్వేల్ అంబేడ్కర్ ఎస్సీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అటకూరి రాములు, ప్రధాన కార్యదర్శి మస్కూరి కిష్టయ్య కోరారు. బుధవారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితుల మధ్య చిచ్చుపెడుతూ ధర్నాలు, రాస్తారోకోలు చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు బొల్లారం ఎల్లయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆదర్శం

మర్కూక్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగార్జునసాగర్ తమ ఇద్దరు పిల్లలను మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. బుధవారం పాఠశాలకు రూ. 15 వేల విలువ గల ప్రింటర్, పిల్లలకు ఫైల్స్‌ను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, హెచ్ఎం ఓంకార్, ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





దుబ్బాక: టీవీలో తిలకిస్తున్న ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, సుభాష్ సురేష్ చంద్ర

జయహో భారత్

చంద్రయాన్-3 సక్సెస్‌తో బుధవారం జిల్లావ్యాప్తంగా సంబరాలు జరుపుకున్నారు. చంద్రుడు దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ ప్రక్రియను టీవీల్లో ఆసక్తిగా తిలకించారు. పలు పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు తెలిపారు.



హుస్నాబాద్‌లో యువకుల సంబరాలు



గజ్వేల్‌లో...

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం



బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బుధవారం పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. సమాచారం తెలుసుకున్న గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి, అదనపు సీఐ రంగ కృష్ణ, ట్రాఫిక్ సీఐ తిరుపతి తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కుడిక్యాల రాములు, మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కో కన్వీనర్లు బండారు మహేష్, సురేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, ఎస్సీసెల్ నాయకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

దుబ్బాక: మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దుబ్బాక పట్టణంలో బుధవారం మైనంపల్లి దిష్టిబొమ్మను దహనం చేశారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకుంటే రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెళ్లి ఎల్లారెడ్డి, సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి పంతులు, కౌన్సిలర్లు యాదగిరి, స్వామి, కనకయ్య, బీఆర్ఎస్ నాయకులు భూంరెడ్డి, కిషన్‌రెడ్డి, రామస్వామి గౌడ్, వడ్లకొండ శ్రీధర్, పండు, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై విమర్శలు సరికాదు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి హరీశ్‌రావును విమర్శిస్తే సహించేది లేదని ఎంపీపీ గజ్జెల సాయిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఏఎంసీ తాజా మాజీ వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సూకూరి లింగం, గొల్లరాములు, తోకల నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.



దుబ్బాక: మైనంపల్లి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దుబ్బాకటౌన్: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన పట్టణంలోని బాలాజీ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా బాలాజీ సహిత పద్మావతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు స్వామివారికి హారతినిచ్చి ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. గురువారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రయాణికురాలికి బ్యాగు అప్పగింత

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన మహిళా ప్రయాణికురాలి బ్యాగును పోలీసులు తిరిగి అప్పగించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొమ్మాటకు చెందిన చంద్రకళ హైదరాబాద్ నుంచి మంగళవారం తన స్వగ్రామానికి వస్తోంది. ప్రజ్ఞాపూర్‌లో తన బ్యాగును మరచిపోయి బస్సు దిగి వెళ్లిపోయింది. బ్యాగు లేదని విషయం గ్రహించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా కానిస్టేబుళ్లు రవి, వెంకటేష్ సీసీ కెమెరాల్లో బ్యాగును గుర్తించారు. బుధవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ప్రయాణికురాలు చంద్రకళకు సీఐ బ్యాగును అందజేశారు. బ్యాగులో 3 తులాల బంగారం, 25 తులాల వెండి, రూ. 10 వేల నగదు, మొబైల్ ఫోన్ ఉంది.



బ్యాగును అందజేస్తున్న సీఐ జాన్‌రెడ్డి



ఘనంగా పోచమ్మ బోనాలు

హుస్నాబాద్: పట్టణంలో బుధవారం బేడ బుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు, చప్పుళ్లతో పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ దేవాలయంలో బోనాలను సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విభీషణ్‌రెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందులకు చెందిన విభీషణ్‌రెడ్డిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలానికి ఇటీవల గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో గిరిజన, గిరిజనేతర విద్యార్థినులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్, కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలను హుస్నాబాద్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 9550923661 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పీజీ ఎంట్రెన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

బెజ్జంకి(సిద్దిపేట): ఓయూ పీజీ ఎంట్రెన్స్‌లో సిద్దిపేట విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 25వ ర్యాంకుతో పాటు వివిధ సబ్జెక్టుల్లో వంద లోపు ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఆన్‌లైన్ కోచింగ్‌కు సేవలందించిన డాక్టర్ పవన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి మదన్‌మోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అకడమిక్ కోఆర్డినేటర్ గోపాల సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల శాఖ అధ్యక్షుడు బాపురెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ, సమస్యల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయక పోవడంతో విద్యావ్యవస్థ పూర్తిగా కుంటుపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జోన్ కన్వీనర్ కొమాండ్ల రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న టీపీటీఎఫ్ ప్రతినిధులు

పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దుదాం

సిద్దిపేటజోన్: అందరూ సమష్టిగా పని చేసి పరిశుభ్రమైన పట్టణంగా సిద్దిపేటను మార్చుకుందామని మున్సిపల్ కమిషనర్ సంపత్ అన్నారు. బుధవారం 11, 27 వార్డుల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మురికి కాలువలో చెత్తా చెదారం తొలగించి పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. పట్టణ శివారులోని గృహాల వద్ద చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. అనంతరం డీఆర్‌సీ కేంద్రంలో తనిఖీ చేశారు.



తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మిరుదొడ్డి(దుబ్బాక): దివ్యాంగులకు రూ. 3,016 నుంచి రూ. 4,016 పెన్షన్ పెంపు పట్ల అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు మొగుళ్ల ఐలయ్య మాట్లాడుతూ... దివ్యాంగుల పెన్షన్ పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల నాయకులు గరిపెల్లి మల్లికార్జున్, పొడేటి రాజు, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.





అ'పూర్వ' సమ్మేళనం

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999- 2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రిమ్మనగూడలోని ఎస్4లో బుధవారం కలుసుకున్నారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● **గద్దర్ సంస్మరణ సభకు తరలిరావాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని టీవైఆర్ గార్డెన్‌లో గురువారం నిర్వహించనున్న గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు శంకర్ కోరారు. బుధవారం తిగుల్ పాఠశాలలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సభకు అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ కాశీం, తదితరులు హాజరవుతారని తెలిపారు.

● **బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలి**

హుస్నాబాద్: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు ఎక్కువ ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిన పార్టీ వైపే బీసీలు ఉంటారని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ స్పష్టం చేశాడు. బుధవారం బీసీ నాయకులతో కలిసి మాట్లాడారు.

● **దుబ్బాక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీకాంత్**

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ధర్మాజీపేటకు చెందిన బురాని శ్రీకాంత్ నియామకమయ్యాడు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రం అందించారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా సైనికుడిలా పని చేస్తానని పేర్కొన్నారు.

● **జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ**

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని సింగాటంలో జీపీ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన టేకుమల్ల భూపతిరావు, శ్రీధర్‌రావు, గోపాల్‌రావు, రాజేశ్వర్‌రావు, పురుషోత్తంరావు భూమిని కేటాయించగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు నిర్మాణ పనులను ప్రారంభించారు.

● **చిట్యాలలో..**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాలలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ, గ్రంథాలయ భవన నిర్మాణానికి బుధవారం సర్పంచ్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సులోచన, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● **గొర్రెల పంపిణీ**

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని నర్సాయిపల్లిలో గొల్ల, కురుమలకు బుధవారం సర్పంచ్ బద్దిపడగ లలితా కృష్ణారెడ్డి గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● **ఓటు హక్కు నమోదు చేసుకోవాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గోవర్ధన్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలోని అన్ని గ్రామాలకు నూతన ఓటర్ లిస్టు జాబితాలను వెలువరించామని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 19వ తేదీ లోపు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

● **సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయ 31వ వార్షికోత్సవం ఈ నెల 25 నుంచి 28 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ తెలిపారు.

● **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరులో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరు చేసిన రూ. 25 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మిట్టపల్లి సులోచన, ఉప సర్పంచ్ లక్ష్మణ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **ముందస్తు అరెస్టులు సరికాదు**

కోహెడ(హుస్నాబాద్): హామీల అమలు కోసం బీజేపీ నాయకులు హుస్నాబాద్ క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వగా.. పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే హక్కులను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్టులతో అణిచివేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నర్సయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, రాంచంద్రారెడ్డి, సాగర్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● **ఉత్తమ పురస్కారం**



జానకిరాములు

బెజ్జంకి(సిద్దిపేట): వైద్య రంగంలో 42 ఏళ్లుగా విశిష్ట సేవలు అందించినందుకు గానూ మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు జానకిరాములును వైద్య శిరోమణి గౌరవ పురస్కారానికి ఎంపిక చేసినట్లు విశ్వకర్మ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు డాక్టర్ మాచవరం గౌరిశంకరాచార్యులు, బాల బ్రహ్మాచారి బుధవారం తెలిపారు.

● **డిజిటల్ తరగతులు ప్రారంభం**

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యా విధానంలో డిజిటల్ విద్య ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని ఎంఈఓ జోగు ప్రభుదాసు, మండల నోడల్ అధికారి చక్రపాణి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు.

● **సిద్దిపేట టికెట్ కేటాయించండి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సిద్దిపేట ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సూర్య వర్మ సిద్దిపేట అసెంబ్లీ టికెట్ కోసం, సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల టికెట్ కోసం గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

● **గుడిలో చోరీ**



వర్గల్(గజ్వేల్): మండలంలోని అనంతగిరిపల్లి పెద్దమ్మ గుడిలో దొంగలు పడ్డారు. మంగళవారం రాత్రి గుడి తాళాలు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. బుధవారం ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్తులు గుర్తించారు. గౌరారం ఎస్సై విజయ్ భాస్కర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి చోరీ జరిగిన తీరు, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990